సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



వార్షికోత్సవాలు ప్రారంభం
మఠంపల్లి శుభవార్త చర్చి వార్షికోత్స వాలను గురువారం సాయంత్రం ఫాదర్ మార్టిన్ ప్రారంభించారు. - 10లో



డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్
డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. - 10లో

గరిష్టం/కనిష్టం
43° /26°

వాతావరణం
ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రత్యేక లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా కోర్టు ప్రాంగణంలో జూన్ 9 నుంచి 14 వరకు జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ లక్ష్మీ శారద కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులకు సంయుక్తంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెక్ బౌన్స్ కేసులు, ప్రామిసరి నోట్ కేసులు, బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల్లో తీసుకున్న లోన్‌కు సంబంధించిన కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. బ్యాంకుల కార్యకలపాలు, లావాదేవీలను నిలబెట్టడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కక్షిదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి న్యాయం చేకూర్చేలా జూనియర్ సివిల్ జడ్జిలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. నగదు చెల్లించే క్రమంలో బ్యాంకులు వడ్డీమాఫీ చేస్తాయని సూచించారు. ఇతర ఆర్థిక సంస్థలు రెండు వాయిదాల్లో చెల్లిస్తే 20 నుంచి 25 శాతం వడ్డీ తగ్గిస్తాయన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకర బోయిన శ్రీనివాస్, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, డీఎల్ఎస్ఏ సభ్యులు గుంటూరు మధు, అల్లంనేని వెంకటేశ్వర్‌రావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులు త్వరగా స్పందించాలి




మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటటౌన్: కేసు దర్యాప్తులో పోలీస్ ఇన్వెస్టిగేషన్ అధికారులకు అవసరమైన వివరాలు అందించడంలో బ్యాంకు అధికారులు త్వరగా స్పందించాలని ఎస్పీ కె.నర్సింహ కోరారు. సైబర్ నేరాల నివారణ, సైబర్ కేసుల దర్యాప్తుకు సంబంధించి గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, అదనపు ఎస్పీ నాగేశ్వరావు లతో కలిసి బ్యాంక్ సంస్థల కంట్రోలర్స్, రీజనల్ మేనేజర్స్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు రోజూ పెరుగుతున్నాయని, సైబర్ మోసాల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించడంలో పోలీసులతో కలిసి బ్యాంక్ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 కు ఫోన్ చేసి పోలీస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, కోదాడ రూరల్ సీఐ రజిత రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అర్వపల్లి: ధాన్యం కొనుగోళ్లను నిర్వాహకులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు కోరారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని రామన్నగూడెం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపాలని ఆదేశించారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి సూరారపు శ్రీను, రైతులు భద్రయ్య, రాములు, సంజీవ, పూల్ సింగ్, రాజు, రవి, నాగయ్య పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఏకాదశిని పురస్కరించుకొని గురువారం లక్ష పుష్పార్చన పూజను పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు సుగంధ పుష్పాలు, తులసీ దళాలతో లక్ష పుష్పార్చన పూజ జరిపించారు. భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఉగ్రదాడిపై నిరసన



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ గురువారం సూర్యాపేట పట్టణంలోని కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



నేరేడుచర్ల పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

26 నుంచి వేసవి శిక్షణ తరగతులు

సూర్యాపేటటౌన్ : ఈనెల 26 నుంచి బాలభవన్‌లోవేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీఈఓ అశోక్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎండాకాలం విద్యార్థులు వారి సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి వారిలో దాగిన నైపుణ్యాలను మెరుగు పరచడానికి వేసవి శిక్షణ బాగా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. లలిత కళలు, డ్యాన్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఎంబ్రాయిడరీ, సంగీతం, వాయిద్యం, మెడిటేషన్, నీతి కథలు, సైన్స్ ప్రయోగాలు, సంస్కృతి పరమైన ఇతరత్ర అంశాలు నచ్చిన వాటిలో శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు జనార్దన్, రమణ, బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి, సిబ్బంది బండారు వీరయ్య, పాల్గొన్నారు.

అర్హతకు మించి వైద్యం!

రోగుల ప్రాణాలతో చెలగాటం

- చదివిందొకటి.. చేసేవైద్యం మరొకటి
- అర్హతలేకున్నా ఎండీ రేడియాలజిస్ట్‌గా ఒకరు..
- ఎంబీబీఎస్ చేసి ఎండీగా మరో ఇద్దరు..
- అనస్తీషియా డాక్టరే ఆపరేషన్లు చేస్తూ..
- ల్యాబ్ టెక్నీషియనే డాక్టర్‌గా చలామణి
- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీల్లో బట్టబయలు



సూర్యాపేటటౌన్ : నకిలీ డాక్టర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. అర్హతకు మించి వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఏళ్లతరబడి అధికారుల కళ్లుగప్పి వైద్యం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. వారం రోజుల క్రితం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి ల్యాబ్ టెక్నీషియనే డాక్టర్‌గా చలామణిఅవుతున్న బాగోతం గుట్టురట్టు చేశారు. తాజాగా గురువారం నిర్వహించిన తనిఖీల్లోనూ నలుగురు డాక్టర్ల వ్యవహారం బట్టబయలైంది.

అర్హత లేకుండానే 13 ఏళ్ల నుంచి వైద్యం

అర్హత లేకున్నా నకిలీ సర్టిఫికెట్‌తో 13 ఏళ్లుగా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్ బాగోతం అధికారుల తనిఖీల్లో బయటపడింది. జిల్లా కేంద్రంలో ఆపిల్ స్కాన్ సెంటర్ నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్ ఇన్నాళ్లు ఎండీ రేడియాలజిస్టుగా చలామణి అవుతూ వచ్చారు. అయితే గురువారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల బృందం తనిఖీల్లో కేవలం ఎంబీబీఎస్ మాత్రమే పూర్తి చేసినట్లు సర్టిఫికెట్స్ బయటపడ్డాయి. డాక్టర్ కిరణ్ తన తండ్రి వీరభద్రం పేరులోని ఇంగ్లిష్ అక్షరాలలోని ఎం.డీ. పదాలను ఎంబీబీఎస్ పక్కన చేర్చి ఎంబీబీఎస్ ఎం.డీ. రేడియాలజిస్ట్ గా నకిలీ సర్టిఫికెట్ సృష్టించారు. ఈసర్టిఫికెట్‌తో ఆపిల్ స్కాన్ సెంటర్ పేరుపై 2013 లో రిజిస్టర్ చేసుకోగా గతేడాది సెప్టెంబర్ నెలలో దీనిని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుడ్డిగా రెన్యువల్ చేశారు. అంతేకాకుండా ఇదే స్కానింగ్ సెంటర్ లో పని చేస్తున్న మరో రేడియాలజిస్ట్ జుల్ఫికర్ అలీ ఖాన్ అనే డాక్టర్ ఎంబీబీఎస్ పూర్తిచేసి ఎం.డీ.గా చెప్పుకుంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే సదరు డాక్టర్ ఎంబీబీఎస్ ఏపీ రిజిస్ట్రేషన్ ఉంది. తెలంగాణ రిజిస్ట్రేషన్ లేకుండానే ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ వ్యవహారం బయట పడడంతో వెంటనే బోర్డు మార్చేయడం గమనార్హం.

ఫేక్ డాక్టర్లను గుర్తించి..

జిల్లా కేంద్రంలో మరి కొంత మంది ఫేక్ డాక్టర్లు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం పలువురి ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు దాడులు చేపట్టగా.. పలు ఆసుపత్రుల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. అర్హత లేకుండా వైద్యం అందిస్తున్న కొంత మంది డాక్టర్లు ఉన్నట్టు గుర్తించిన కౌన్సిల్ సభ్యులు జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో నకిలీ డాక్టర్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అర్హత లేని ఫేక్ డాక్టర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు హెచ్చరిస్తున్నారు.

శరత్ కార్డియాక్ కేర్ సెంటర్ సీజ్..

సూర్యాపేటలో శరత్ కార్డియాక్ కేర్ ఆసుపత్రిలో వారం రోజుల క్రితం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. గుండె సంబంధిత వైద్యం అందిస్తామని డాక్టర్ శిరీష పేరిట అనుమతి తీసుకుని అసలు డాక్టరే లేకుండా ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియనే వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం సదరు ఆసుపత్రిని సీజ్ చేశారు.

మేనేజ్‌మెంట్ డాక్టర్‌గా..

సూర్యాపేటలో పుట్టగొడుగుల్లా ఆసుపత్రులు వెలుస్తున్నాయి. కొందరు అర్హత లేని వారు కూడా వేరే వ్యక్తి ఫార్మసీ సర్టిఫికెట్, డాక్టర్ల సర్టిఫికెట్లను అద్దెకు తీసుకుంటూ వారికి నెలనెలా జీతం చెల్లిస్తూ ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు. కమీషన్ల ఎర చూపి జిల్లాలోని ఆర్ఎంపీల ను తమ వైపు తిప్పుకొని రోగులు వచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే కొంతమంది హాస్పిటల్ మేనేజ్‌మెంట్ డాక్టర్లు లేకుండానే వాళ్లే డాక్టర్లుగా చలామణి అవుతూ కోట్లు సంపాదిస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్య హాస్పిటల్ లో డాక్టర్ లేకుండానే కేవలం మేనేజ్‌మెంట్ హాస్పిటల్ నడిపిస్తూ అడ్డంగా దొరికిపోయారు. తనిఖీల సమయంలో డాక్టర్ స్థానంలో మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన వ్యక్తి ఉండడం గమనార్హం. అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణ హాస్పిటల్ నిర్వహిస్తున్న డాక్టర్ రవి శేఖర్ అనస్తీషియా అర్హత ఉండగా జనరల్ ఫిజీషియన్ గా అవతారం ఎత్తి ఏకంగా సర్జరీలు చేస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. అంతేకాకుండా హాస్పిటల్ లో ఎలాంటి పర్మిషన్ లేకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ నిర్వహిస్తుండగా అందులో పని చేస్తున్న రేడియాలజిస్ట్ సైతం ఏపీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఉండడం కొసమెరుపు.



యాపిల్ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి వస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు

రెన్యువల్ చేయకుండా రెండేళ్లుగా ప్రాక్టీస్...

సూర్యాపేట జిల్లా కేంద్రంలో సాయి గణేష్ హాస్పిటల్ నడిపిస్తున్న డాక్టర్ సందీప్ కుమార్ చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసి 2019 నుంచి సూర్యాపేటలో ఎం.డీ.గా చలామణి అవుతున్నారు. అయితే రెండేళ్ల క్రితం చైనా ఎంబీబీఎస్ సర్టిఫికెట్ గడువు ముగిసినా.. రెన్యువల్ చేయకుండా నిర్లక్ష్యంగా హాస్పిటల్ నిర్వహిస్తున్నారు. తనిఖీల సమయంలో రెండేళ్ల నుంచి ప్రాక్టీస్ చేయడం లేదని తప్పించుకునే ప్రయత్నం చేసినా.. మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఔట్ పేషెంట్ షీట్ లను పరిశీలించి హాస్పిటల్ లో ట్రీట్మెంట్ చేయించుకున్న పేషెంట్లకు ఫోన్ చేసి మాట్లాడి సదరు డాక్టర్ ప్రాక్టీస్ చేస్తున్నారని నిర్ధారించారు.



సాయి గణేష్ ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు

నోటీసులు అందిస్తాం

సూర్యాపేట జిల్లా కేంద్రంలో అక్రమంగా హాస్పిటల్స్ నడిపిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించాం.ఆపిల్ స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్ నకిలీ సర్టిఫికెట్స్‌తో రేడియాలజిస్ట్ గా ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించాం. వీటితో పాటు సాయి గణేష్, సూర్యా, శ్రీ కృష్ణ హాస్పిటల్ లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. వీరికి నోటీసులు అందించి చర్యలు తీసుకుంటాం. తనిఖీల నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. - డాక్టర్ నరేష్ కుమార్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు

భూ భారతితో రైతులకు సత్వర న్యాయం



అర్వపల్లిలో సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పక్కన ఎమ్మెల్యే సామేలు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అర్వపల్లి: భూ భారతి చట్టంతో రైతులకు సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. భూ భారతి చట్టంపై అర్వపల్లిలో గురువారం నిర్వహించిన సదస్సుకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుతో కలిసి పాల్గొని మాట్లాడారు. భూ భారతి ద్వారా గ్రామాల్లో ఎక్కడికక్కడ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమస్యను బట్టి తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించవచ్చని చెప్పారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ ధరణితో రైతులు పడిన కష్టాలను చూసిన సీఎం రేవంత్‌రెడ్డి భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. త్వరలో రైతుల భూసమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ భూసమస్యలను పరిష్కరించి రైతులు, ఇళ్ల యజమానులకు తగు న్యాయం చేయాలని కోరారు. ఈ సదస్సులో ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్‌లు జక్కర్తి శ్రీనివాసులు, బ్రహ్మయ్య, హరిప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు బైరబోయిన సైదులు, జలేందర్‌రావు, ఎంపీడీఓ గోపి, ఏఓ గణేష్, నాయబ్ తహసీల్దార్ సీహెచ్. యాదగిరి, ఏపీఓ ఉపేందర్, గిర్దావర్‌లు జలేందర్‌రావు, వెంకట్‌రెడ్డి, ప్రసన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవిలయ్య, నాయకులు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, జీడి వీరస్వామి, బైరబోయిన మహరాజు పాల్గొన్నారు.

బడులను బలోపేతం చేయాలి

భానుపురి(సూర్యాపేట): సర్కార్ బడులు బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాలకు చెందిన ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో చక్కగా చదువు చెప్తామని విద్యార్థుల్లో నమ్మకం కల్పించి వచ్చే విద్యా సంవత్సరానికి ఎక్కువ మంది పిల్లలు నమోదయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లాలో తుంగతుర్తి ప్రాంతాన్ని అభివృద్ధి పర్చాలంటే మొదట ఆయుధం చదువు ద్వారానే సాధ్యం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, క్వాలిటీ కో ఆర్డినేటర్ జనార్దన్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్, ఇంక్లూజివ్ కో ఆర్డినేటర్ రాంబాబు, జనరల్ ఈక్వాలిటీ కో ఆర్డినేటర్ పూలమ్మ, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మార్కెట్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలక వర్గం బాధ్యతలు స్వీకరించింది. గురువారం ఆ కార్యాలయములో ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీధర్ సమక్షంలో చైర్‌పర్సన్ దేశ్‌ముఖ్ రాధిక అరుణ్ కుమార్, వైస్ చైర్మన్ ఆదూరి స్రవంతి కిషోర్ రెడ్డి, సభ్యులు ముత్యాలంపాటి నాగుల్ మీరా, బత్తుల సైదిరెడ్డి, తొడేటి శ్రీనివాస రావు, మోదాల వెంకన్న, లచ్చిమల్ల నాగేశ్వరరావు, గజ్జెల కొండా రెడ్డి, నట్టె జానకి రాములు, నందిపాటి కోటయ్య, భూక్యా రాయ్సిల్, చెక్కర వెంకటరెడ్డి, మట్టపల్లి వెంకటనారాయణ, గుండా శ్రీనివాసరావు, జవ్వాజి రామ చంద్రయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి శర్మ, ఏడీఏ రవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారిని స్థానిక నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ ద్వితీయ శ్రేణి కార్యదర్శి, సిబ్బంది, రైస్ మిల్లుల ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేటటౌన్ : దక్షిణ భారతదేశంలో మరో కుంభమేళాగా వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ కోరారు. గురువారం సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ మాటల కోసం అన్ని వర్గాల ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. కేసీఆర్ ఇన్నాళ్లు మౌనంగా ఉన్నాడని, ఇప్పుడు సభలో ఏం చెబుతాడో, తమకు ఏం భరోసా ఇస్తాడో అన్న ఆసక్తి ప్రజల్లో నెలకొందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, రైతుల పంటలకు నీళ్లు ఇవ్వకపోవడంతో అవి పూర్తిగా ఎండిపోయాయని, పండిన కొద్ది పంటను కొనక రైతులు తగులబెట్టి నిరసన వ్యక్తం చేస్తూ మళ్లీ కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారన్నారు. నాడు 14 ఏళ్లు ఉద్యమం చేసినా, పదేళ్లపాటు అభివృద్ధి చేసినా, నేడు 16 నెలలు ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ ప్రజల కోసమే బీఆర్ఎస్ పని చేస్తుందని చెప్పారు. సభకు సూర్యాపేట జిల్లా నుంచి 40 వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ సభకు పయనమైన రైతుల ఎడ్ల బండ్లకు గ్రామగ్రామాన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సమావేశంలో గ్రంథాయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, బొమ్మ గాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళ తెరిచి ఉన్న జీఎస్టీ కార్యాలయం

- ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు
- కోదాడలో చర్చనీయాంశం

కోదాడ: కోదాడ పట్టణంలోని జీఎస్టీకార్యాలయం రాత్రివేళ తెరిచిఉండడం.. అధికారులు విధులు నిర్వహించడం.. ఆఫీస్ ఎదుట అధికారి వాహనం ఉండడం చర్చనీయాంశమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణంలో ప్రధాన రహదారిపై జీఎస్టీ కార్యాలయం ఉంది. గురువారం తెల్లవారు జామున 4.15 గంటలకు ఆఫీస్‌కు సొంత వాహనంలో వచ్చిన అధికారి లోపలికి వెళ్లి గడియపెట్టుకున్నట్లు తెలిసింది. తెల్లవారే వరకు కార్యాలయంలోనే ఉన్నారని సమాచారం. అర్ధరాత్రి నుంచి అధికారి వాహనం కార్యాలయం ముందే ఉందని తెల్సుకున్న కొందరు 4 గంటలకు అక్కడికి వచ్చి చూసినట్లు సమాచారం. కార్యాలయం తాళం తీసి ఉండడమే కాకుండా లోపల గడియ పెట్టుకొని ఉండడంతో దాన్ని ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. కోదాడకు చెందిన కొందరు జీఎస్టీ అధికారులు అర్ధరాత్రి రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అనధికార తనిఖీలు నిర్వహించి రెండు లారీలను పట్టుకున్నారని, వారి నుంచి భారీగా వసూలు చేసి కార్యాలయానికి చేరుకున్నారని, పంపకాల్లో తేడాలు రావడంతో వారిలో కొందరు ఈ ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టినట్లు ఇక్కడ ప్రచారం సాగుతోంది. జీఎస్టీ అధికారికి ప్రభుత్వం ప్రతినెలా వాహన అలవెన్స్ చెల్లిస్తున్నా సొంత వాహనాన్ని అద్దె వాహనంగా చూపి బిల్లులు డ్రా చేస్తున్నారని ఆరోపణలున్నాయి. దీనిపై స్థానిక అధికారులు మాత్రం ఇది డ్యూటీలో భాగమేనని, ప్రత్యేకం ఏమీ లేదని స్పష్ట చేస్తున్నారు. డ్యూటీలో భాగంగా బాత్‌రూం కోసం కార్యాలయానికి వచ్చినట్లు చెబుతున్నారు.



గురువారం తెల్లవారుజామున తాళం తీసి ఉన్న జీఎస్టీ కార్యాలయం



కార్యాలయం ముందు పార్కు చేసిన అధికారి వాహనం

చిన్నపిల్లలకు విధిగా టీకాలు వేయించాలి

నేరేడుచర్ల : చిన్నపిల్లలకు టీకాలు వేయించి వ్యాధుల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటా చలం కోరారు. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇంటెన్సిఫైడ్ మిషన్, ఇంద్రధనుస్సు, స్పెషల్ టీకాల కార్యక్రమంపై చర్చించారు.0-5 సంవత్సరాల పిల్లల్లో గతంలో టీకాలు వేయించుకొని వారికి, సంచార జాతుల వారికి, టీకాలు మధ్యలో ఆపినవారికి టీకాలు పూర్తిగా అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సల్వాది శ్రీనివాస్, ఏఎన్ఎం మమత, ఆశా వర్కర్ స్వర్ణలత, గ్రామ కార్యదర్శి నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.



నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలోని హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

క్లుప్తంగా

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: పెళ్లి కావడం లేదని మన స్తాపంతో యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం జరిగింది. రైల్వే ఏఎస్ఐ బి. సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్‌బండకు చెందిన చల్లా లింగయ్య కుమారుడు చల్లా కళ్యాణ్(27) తనకు పెళ్లి కావడం లేదని కొంతకాలంగా తీవ్ర మనస్తాపంతో ఉన్నాడు. బుధవారం వారి బంధువుల పెళ్లికి హాజరైన కళ్యాణ్ ఇంటికి తిరిగి వచ్చాడు. గురువారం ఉదయం బైక్‌పై మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఏఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో ..


మహేష్ (ఫైల్)

రాజాపేట: అప్పుల బాధతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజాపేట మండలం కొండ్రెడ్డిచెర్వులో గురువారం రాత్రి జరిగింది. కొండ్రెడ్డిచెర్వు గ్రామానికి చెందిన కర్రె మహేష్(28)కు అదే గ్రామానికి చెందిన కళ్యాణితో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మహేష్ తన కుటుంబంతో కలిసి రంగారెడ్డి జిల్లాకు వలస వెళ్లి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో గిరాకీలు తగ్గడంతో ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఆటోలో గ్రామానికి చెందిన కూలీలతో కలిసి నిత్యం కూలీ పనికి వెళ్తూ తనకున్న 2 ఎకరాల్లో వ్యవసాయం చేసేవాడు. 5 బోర్లు వేయడం, ఇల్లు కట్టడం, కొత్త ప్యాసింజర్ ఆటో కొనడం వంటి వాటికి రూ.20 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చేందుకు ఎకరంన్నర భూమి అమ్మాడు. పంట దిగుబడి రాక, ఆటో నడవక అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. గురువారం మహేష్ భార్య కళ్యాణి అదే గ్రామంలో ఉన్న తన తల్లిగారింటికి వెళ్లింది. పనికి వెళ్లిన మహేష్ రాత్రయినా కళ్యాణి వాళ్ల తల్లిగారింటికి రాకపోయేసరికి, కళ్యాణి తమ ఇంటికి వెళ్లి చూడగా.. మహేష్ ఉరేసుకుని కనిపించాడు.

అనారోగ్యంతో వృద్ధుడు..

అడ్డగూడూరు: అనారోగంతో బాధపడుతున్న వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం కోటమర్తిలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటమర్తి గ్రామానికి చెందిన కొంపెల్లి నారాయణ(60) కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన నారాయణ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రయినా నారాయణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం నారాయణ మనవడు వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా అక్కడ చెట్టుకు ఉరేసుకుని నారాయణ ఆత్మహత్య చేసుకుని కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యంతో చదవాలి

- నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్


విద్యార్థులు రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యేలు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

నకిరేకల్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యంతో చదవాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. నకిరేకల్ పట్టణంలోని ఉద్దీపన(వీవీఎం ఎయిడెడ్) స్కూల్ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో స్కూల్ చైర్మన్, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను కూడా చిన్నతనం నుంచే ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగానని గుర్తుచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తమకు ఇష్టమైన ఆటల్లో ప్రోత్సహించాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సారథ్యంలో ఉద్దీపన స్కూల్‌లో కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తుండడం అభినందనీయమన్నారు. నకిరేకల్ జెడ్పీహెచ్ఎస్‌ను పోలీస్ శాఖ దత్తత తీసుకుని ఎన్‌రోల్‌మెంట్ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీరేశం నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని చెప్పారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం గంగాధర భద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్కూల్ సలహాదారుడు డాక్టర్ ఆనందన్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, ట్రస్మా గౌరవ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్లు మంజుల, రజితాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీలు చామల శ్రీనివాస్, బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, వివిధ మండలాల ఎంఈఓలు మేకల నాగయ్య, అంబటి అంజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, చెరుకు సతీష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- 2400 స్పాస్మో ట్యాబ్లెట్లు, బైక్, రూ.22,000 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి, వారి నుంచి 2400 స్పాస్మో ట్యాబ్లెట్లు, ఒక బైక్, రూ.22,000 నగదు, రెండు సెల్‌ఫోన్లు, మెడికల్ షాప్ లైసెన్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ కేసు వివరాలను ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 11గంటల సమయంలో నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మునుగోడు రోడ్డులో వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సందీప్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని అక్కచెల్మ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా వసీముద్దీన్ అలియాస్ వసీం అక్రం బైక్‌పై బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగును తనిఖీ చేయగా అందులో 288 మత్తు కల్గించే స్పాస్మో ట్యాబ్లెట్ షీట్లు లభించాయి. అతడి నుంచి ట్యాబ్లెట్ల షీట్లతో పాటు బైక్, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వసీముద్దీన్‌తో పాటు అక్కచెల్మ ప్రాంతానికే చెందిన అతడి స్నేహితులు ఖాజా షోయబ్, షేక్ అమేర్ కొంతకాలంగా స్పాస్మో ట్యాబ్లెట్స్ సేవిస్తూ వాటికి బానిసయ్యారని డీఎస్పీ పేర్కొన్నారు. ఈజీగా డబ్బులు సంపాదించాలని వీరు ముగ్గురు స్థానికంగా మెడికల్ షాపుల్లో ఈ స్పాస్మో ట్యాబ్లెట్లు అమ్మట్లేదని తెలుసుకుని, గత ఆరు నెలల నుంచి ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఛాయా మెడికల్ షాప్ నిర్వాహకుడు కొప్పురవారి యశ్వంత్ మణిదీప్ శ్రీనివాసరావు దగ్గరకు బైక్‌పై వెళ్లి స్పాస్మో ట్యాబ్లెట్లు కొనుగోలు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఒక్కో షీట్‌ను రూ.100కు కొని వారి అవసరం మేరకు వినియోగించగా.. మిగిలిన ట్యాబ్లెట్లను ఒక్కో షీట్ రూ.180కు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పట్టుబడిన వసీముద్దీన్‌ను తీసుకొని పిడుగురాళ్లకు వెళ్లి ఛాయా మెడికల్ షాప్ నిర్వాహకుడు మణిదీప్ శ్రీనివాసరావును పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 15 షీట్ల స్పాస్మో ట్యాబ్లెట్లు, సెల్‌ఫోన్, మెడికల్ షాపు లైసెన్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. వసీముద్దీన్, మణిదీప్ శ్రీనివాసరావును రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఖాజా షోయబ్, షేక్ అమేర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు శంకర్, సందీప్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రబ్బాని వెంకటనారాయణ, కిరణ్, షకీల్, శ్రీకాంత్, సైదులును ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి ట్యాబ్లెట్లు అమ్మొద్దు..

మెడికల్ షాపుల నిర్వాహకులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి ట్యాబ్లెట్లు అమ్మొద్దని డీఎస్పీ శివరాంరెడ్డి సూచించారు. ఒకవేళ అధిక డబ్బులకు ఆశపడి అమ్మితే షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా స్పాస్మో ట్యాబ్లెట్ల కోసం మెడికల్ షాపుల వద్దకు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

శుభవార్త చర్చి వార్షికోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ మార్టిన్

మఠంపల్లి: మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త చర్చి వార్షికోత్సవాలను గురువారం సాయంత్రం ఫాదర్ మార్టిన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం చర్చిలో జరిగే దివ్యబలి పూజలకు నల్లగొండ మేత్రాసన పీఠాదిపతి దమన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై సందేశమిస్తారన్నారు. అదే విధంగా సాయంత్రం మేరీమాత ప్రతిమతో పుర వీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫాదర్ అల్లం బాల, చర్చి కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


పందేలకు సిద్ధమైన మాంట్‌ఫోర్ట్ స్కూల్ గ్రౌండ్

ఎద్దుల పందేలకు ఏర్పాట్లు పూర్తి

శుభవార్త చర్చి వార్షికోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శుభోదయ యువజన సంఘం, చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించనున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలకు స్థానిక మాంట్‌ఫోర్ట్ స్కూల్ మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ ఎద్దుల పందేలను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ప్రారంభిస్తారని యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి న్నారు.

వృద్ధురాలికి గాయాలు

అడ్డగూడూరు: వలిగొండ–తొర్రూర్ జాతీయ రహదారిపై అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామ స్టేజీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో మోత్కూరు మండలం ముషిపట్ల గ్రామంలో తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తుండగా.. అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామ స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న పెండెం గౌరమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలపిపారు.

నాణ్యత పాటించని హోటళ్లకు జరిమానా

సూర్యాపేట అర్బన్: సూర్యాపేట పట్టణంలో నాణ్యత పాటించని పలు హోటళ్లకు గురువారం మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. వివరాలు.. పట్టణంలోని డీమార్ట్ సమీపంలోని కావేరి రెస్టారెంట్‌లో మాంసం, చికెన్ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి వినియోగిస్తున్నందన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రూ.5000 జరిమానా విధించారు. ఈ రెస్టారెంట్ పక్కనే గల దిల్‌కుష్ బేకరీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచనందుకు రూ.500, నిల్వ ఉంచిన పదార్థాలతో ఫాస్ట్‌ఫుడ్ చేస్తున్న గాయత్రి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, స్పైసీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్ మస్కాపురం సురేష్, సిబ్బంది బాషమియా, యాదగిరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


హోటళ్లలో తనిఖీ చేస్తున్న అధికారులు

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం.. భార్య మృతి

- భర్తకు గాయాలు


హైమావతి (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: బంధువుల అంత్యక్రియలకు బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి డీసీఎం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో భార్య మృతి చెందింది. భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామ స్టేజీ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం ఏపూర్ గ్రామానికి చెందిన కొండె జంగయ్య తన భార్య హైమావతి(39)తో కలిసి చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో తమ బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామ స్టేజీ వద్దకు రాగానే హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హైమావతి తీవ్రంగా గాయపడింది. జంగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. హైమావతిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జంగయ్య రైల్వే డిపార్ట్‌మెంట్‌లో గ్యాంగ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. వీరికి బీటెక్ చదివే కుమారుడు, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమార్తె ఉన్నారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

వరికోత మిషన్ డ్రైవర్‌పై కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి: యువకుడి చేయి విరగడానికి కారణమైన వరికోత మిషన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో ఈ నెల 22వ తేదీన సాయంత్రం వరికోత మిషన్‌తో ఓ రైతుకు చెందిన వరి పంట కోస్తుండగా మిషన్‌లో వరిగడ్డి ఇరుక్కుపోయింది. దీతో వరికోత మిషన్‌పై హెల్పర్‌గా పనిచేస్తున్న వంకమామిడి గ్రామానికి చెందిన ఇరుకు శివ గడ్డిని తొలగిస్తుండగా.. డ్రైవర్ ఊదరి నవీన్ మిషన్‌ను ఆన్ చేయడంతో శివ చేయి మణికట్టు వరకు తెగిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే శివను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్స చేయించారు. బాధితుడి తండ్రి ఇరుకు మల్లయ్య ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ఊదరి నవీన్‌పై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నష్టాల్లో ఉన్న మదర్ డెయిరీని ఆదుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి

ఆలేరురూరల్: నష్టాల్లో ఉన్న మదర్ డెయిరీకి రూ.50 కోట్లు ఇచ్చి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆలేరులోని వైఎస్ఎన్ గార్డెన్‌లో జరిగిన తెలంగాణ పాల రైతుల రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. మదర్, విజయ, కరీంనగర్, ముల్కనూర్ డెయిరీలతో పాటు ప్రైవేట్ డెయిరీలు తక్కువ రేటుకే పాల సేకరణ చేసి రైతులకు నష్ట చేకుర్చుతున్నారన్నారు. మదర్ డెయిరీ అప్పుల్లో కూరుకపోయిందని ఆస్తులను అమ్మాలని పాలకవర్గం నిర్ణయించడం దారుణమన్నారు. నష్టాలకు కారణం రైతులు కాదని పాలకవర్గాలు చేసిన తప్పిదాలేనని పేర్కొన్నారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లీటర్ పాల ధరకు రూ.5 ఇన్సెంటివ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. భూమిలేని వారికి, వ్యవసాయ కార్మికులకు 90 శాతం సబ్సిడీపై పాడి పశువులను పంపిణీ చేయాలని కోరారు. పాల రైతులకు రూ.3 లక్షలు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య, నర్సింహులు, పోతిరెడ్డి సుదర్శన్, తీగల సాగర్, బొంతల చంద్రారెడ్డి, జంగారెడ్డి, మేక అశోక్, బాలరాజు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సంజీవ్‌రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, భిక్షపతి, సత్తిరెడ్డి, పోశెట్టి, భాస్కర్, నాగరాజు, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

- మిర్యాలగూడ బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తున్న విద్యార్థులు
- సబ్ కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ తనిఖీ
- ఇద్దరిపై కేసు నమోదు


వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ హరిబాబు, ఎంఈఓ బాలునాయక్

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఓపెన్ టెన్త్ పరీక్షల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తుండగా సబ్ కలెక్టర్ ఆదేశాలతో తనిఖీ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ హరిబాబు తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని బకల్‌వాడ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ పరీక్షలకు దరఖాస్తు చేసిన గువ్వల శ్రీనివాస్‌కు స్థానికంగా బాలికల ఉన్నత పాఠశాలలో సెంటర్ పడింది. గువ్వల శ్రీనివాస్‌కు బదులుగా అప్పాముల శ్రీనివాస్ అనే మరో విద్యార్థి గురువారం సాంఘిక శాస్త్రం పరీక్ష రాస్తుండగా.. విషయం తెలుసుకున్న ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సబ్ కలెక్టర్ తహసీల్దార్ హరిబాబు, ఎంఈఓ బాలునాయక్‌ను పరీక్షా కేంద్రానికి పంపి తనిఖీ చేయాలని ఆదేశించారు. రూం నంబర్ 8లో 166 రూల్ నంబర్‌తో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తున్నట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్, కోర్డినేటర్లపై విచారణ చేసి నివేదికను డీఈఓకు పంపుతామని ఎంఈఓ బాలునాయక్ తెలిపారు. కాగా గురువారం పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను డీఈఓ భిక్షపతి తనిఖీ చేశారు. ఈ ఘటనపై విలేకరులు డీఈఓను ప్రశ్నించగా.. ఓపెన్ పరీక్షలు ఓపెన్‌గానే జరుగుతాయని సమాధానం చెప్పడం గమనార్హం.

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరుగుతుందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు ఫిర్యాదు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ధర్మానాయక్, సెంటిమేరీ పాఠశాలలో దశరథ్‌నాయక్, బకల్‌వాడ పాఠశాలలో రాజు, బాలికల ఉన్నత పాఠశాలలో బాలునాయక్ పరీక్షల్లో కాపీ చేయించేందుకు గాను విద్యార్థుల నుంచి రూ.2500 నుంచి రూ.4వేల వరకు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకరికి బదులుగా మరొకరు పరీక్షలు రాసేందుకు గాను రూ.5వేల నుంచి రూ.8వేలు వసూలు చేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

స్వర్ణగిరీశుడికి పంచామృతాభిషేక సేవ


స్వామి వారికి పంచామృతాభిషేక సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారికి గురువారం పంచామృతాభిషేక సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం సుమారు 3వేల మందికి అన్న ప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పెద్దవూర: యాసంగి వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపర్చుకోవాలో తెలియక రైతులు తికమక పడుతుంటారు. ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాలుగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

ధాన్యం నూర్పిన తర్వాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరికోతల సమయంలో ధాన్యంలో 20శాతం తేమ ఉంటుంది. గతంలో కూలీలచే వరి కోతలు కోపించేవారు. కూలీల కొరత ఒకవైపు, అకాల వర్షాల భయంతో పంట చేతికి వచ్చేదాకా రైతులకు భరోసా లేకుండా పోతుంది. కూలీలచే వరి పంటను కోసిన తర్వాత వరి పసలను ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. కానీ ప్రస్తుతం రైతులు వరికోత యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. కాబట్టి పంట పచ్చగా ఉన్నప్పుడే వరి కోతలు కోస్తున్నారు. దీంతో ధాన్యంలో మరింత తేమ ఉండే అవకాశాలు ఉన్నాయి. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 14లోపు వచ్చే దాక చూసుకోవాలి. ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగచేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినడమేకాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.


ఆరబోసిన వడ్లు

పాడిపంట

నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాలు

- **ముక్క పురుగు :** పంట కోయడానికి ముందు నుంచి ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.
- **వడ్ల చిలుక:** ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడువాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులపై కనిపిస్తుంది.
- **నుసి పురుగు:** దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మి.మీ పొడవు ఉంటుంది. ప్రౌఢ కీడకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజ పైపొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెల్లో నిల్వ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు లేదా గిడ్డంగులను సిమెంట్ కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షం నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచుల పైన, లోపల మలాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో ఆరబెట్టాలి.

ఎలుకల నివారణ చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెష్ మూతలు అమర్చాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు.

WANTED TEACHERS

ENRICCH Foundation School, Beside ITI College, MLG Road, Nalgonda offers the best career opportunities for dedicated Teachers. To meet the requirements of additional strength we invite applications for the following posts.

HIGH SCHOOL: Trained Graduate and Post Graduate Teachers to Teach 1) Mathematics, 2) Physics, 3) Chemistry, 4) Social Studies, 5) English, 6) Biology, 7) Hindi, 8) Telugu.

Primary & Pre Primary :- Trained Graduate / Montessori Trained Teachers to Teach all subjects and PET / Office Incharge.

*Come and join us for a Promising career wins a handsome salary. Excellent communication skills an must for all Posts

Walk in interview cum demo on 27th April 2025 time 9 to 4pm

ENRICCH IIT/IAS/IPS/NEET FOUNDATION SCHOOL
Beside ITI College, MLG Road, Nalgonda.
Cell : 90108 24038, 63025 97349

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

- **Wanted** Faculty Sri Raghavendra College of Education, Munugode Road, Nalgonda. Cell : 91339 58840. Applications are invited from the Qualified Candidates for the B.Ed. (All Subjects). Qualification : MA / M.Sc., M.Ed. and SET / NET [YA_2851]
- **Wanted Experienced** TEACHERS Contact: 9700223676 Interview Date: May 28th, 2025 Vishishta High School, Nalgonda. [SCA25002886]
- ప్రముఖ హోంకేర్ సంస్థ **Hyd**లో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీ : 18,000 – 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [SCA25002878]
- నల్గొండలో సామ్ సాంగ్ ఆఫీస్ నందు పని చేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం గల ఉద్యోగులు కావలెను ఆకర్షణమైన జీతం + ఇన్సెంటివ్, 2 వీలర్ ఉన్నవారికి ప్రాధాన్యత సంప్ర॥ 9581393129 [SCA25002833]
- మీ ఇంటివద్దనే వుంటూ **Universal** కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25–30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA25002882]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్గొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.